క్లుప్తంగా

భవిత కేంద్రం పరిశీలన

అల్లవరం: గోడిలంకలోని భవిత కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. ప్రతి బుధవారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల్లో విద్యా నైపుణ్యాలను పెంచుతున్నామన్నారు. దివ్యాంగుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. ఎంఈఓ ఏడుకొండలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22న సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సభ్యులు చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

బదిలీ పాలసీ సిద్ధం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి బదిలీ పాలసీని నూతనంగా తయారు చేసినట్లు హోం మంత్రి నమశ్శివాయ తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు వైద్యనాథన్ బుధవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. విద్యాశాఖలో ఉపాధ్యాయులకు తప్ప మిగతా ఏ శాఖలకు బదిలీల పాలసీ లేదని, అయితే నూతనంగా అన్ని శాఖలకు సంబంధించి పాలసీ తయారు చేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రంగసామి తెలిపారు.

లోపిస్తున్న శాస్త్రీయత

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ అమలులో శాస్త్రీయత లోపిస్తోందని అమలాపురానికి చెందిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏకే భీమారావు అన్నారు. రాష్ట్రంలో సరైన ఎస్సీ గణంకాలు లేకుండా, 2011 నాటి జనాభా లెక్కలతో వర్గీకరణ అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ మేరకు అమలాపురంలో బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్న మాలలకు 7.5 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జనాభా లెక్కలు, కుల గణన జరిగే వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేయరాదని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కౌన్సిల్ హాలులో తొలి చైర్మన్ ఫొటో ఆవిష్కరణ

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి తొలి చైర్మన్‌గా పనిచేసిన దివంగత కుడుపూడి సూర్యనారాయణ ఫొటోను కౌన్సిల్ హాలులో ఆవిష్కరించారు. సూర్యనారాయణ 1940–52 సంవత్సరాల మధ్య అమలాపురం మున్సిపాలిటీకి తొలి చైర్మన్‌గా పనిచేశారు. సూర్యనారాయణ మనవడు నేటి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు. అప్పట్లో తొలి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సూర్యనారాయణ తర్వాత అమలాపురం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా కూడా ఎన్నికయ్యారు. మూడు నెలల కిందట తొలి చైర్మన్ సూర్యనారాయణ ఫొటో కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసింది. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తొలి చైర్మన్ ఫొటో ఇవ్వడంతో కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆవిష్కరించారు. సూర్యనారాయణ చిత్రానికి మనవడు సూర్యనారాయణరావు మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ముందు నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

అమలాపురం రూరల్: పేరూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన వాటర్‌బాయ్ పేరూరు కాశీవిశ్వనాథ్ కుటుంబ సభ్యులకు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులు చొల్లంగి సత్య శ్రీనివాస్‌కుమార్, ఇళ్ల రాము, ఇళ్ల లక్ష్మణ్, నేరెళ్ల నందీశ్వరరావు, కొత్తపల్లి వెంకటరమణ, దొమ్మేటి ఫణికుమార్, దేగల వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి సత్తిబాబు, పెద్దిరెడ్డి శ్రీరాం, కలిగినీడి దొరబాబు, గనిశెట్టి ధనరాజు సేకరించిన రూ.1,27,618 నగదును విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు అందించారు. హెచ్ఎం కేవీఆర్ శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం కాశీవిశ్వనాథ్ భార్య కుమారి, తల్లికి ఆర్థికసాయం చెక్కులు అందించారు.

చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్: రామచంద్రపురం వీఎస్ఎమ్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీలో చెస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రతిభ చాటారు. అకాడమీ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటు నగదు బహుమతులు గెలుచుకున్నారని ఆ అకాడమీ ప్రిన్సిపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ఈ పోటీలకు మొత్తం 133 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారు. అకాడమీ విద్యార్థులు ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ స్థానం, అరిగెల జయప్రకాష్ ద్వితీయ, తాడి సాయి వెంకటేష్ తృతీయ, సాధనాల శ్రీసంతోష్ 5వ స్థానం, బండారు నానిబాబు 6వ స్థానం, అడబాల ప్రావీణ్యశ్రీ 10వ స్థానంలో నిలిచి నగదు బహుమతులు సాధించారు. స్థానిక విక్టరీ అకాడమీలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో విజేతలను అకాడమీ ప్రిన్సిపాల్ వెంకటసురేష్ తదితరులు ప్రశంసించారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- ఈసారీ ముంపు తప్పదా?
- కాలువల మరమ్మతులు, పూడికతీతపై నిర్లక్ష్యం
- ఏటా ముంపుబారిన గ్రామాలు, పంట పొలాలు
- సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు శూన్యం



గుర్రపు డెక్కతో పూడుకుపోయిన ముమ్మిడివరం మేజర్ డ్రెయిన్



తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోయిన కొమానపల్లి-గాడిలంక మీడియం డ్రెయిన్

ముమ్మిడివరం: పంట కాలువలు తూడు, గుర్రపు డెక్కతో పూడికతో నిండిపోవడంతో ఏటా సాగునీరందక రైతులు గగ్గోలుపెడుతున్నారు. అధిక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా పర్యటించి తూతూ మంత్రంగా తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప లోతట్టు ప్రాంతాలు ముంపు బారినపడకుండా శాశ్వత చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే కాలువల నిర్వహణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు, గట్టు బలోపేతం, మరమ్మతు పనులను వేసవిలో పూర్తిచేయాల్సిన డ్రెయిన్స్ అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించకపోవడంపై రైతులు మండి పడుతున్నారు. గతేడాది అధిక వర్షాలు, వరదల వల్ల మండలంలోని ముమ్మిడివరం తిళ్లమ్మ చెరువు, జీఎంసీ బాలయోగి కాలనీ, కంసాలగరువు, మందబయలు కాలనీ, అయినాపురం కొత్తకాలనీ, బొర్రాగట్టు, పెదమెట్ట లంక, గాండిలంకలో ఎస్సీ కాలనీ, కొత్తకాలనీ, కర్రివానిరేవు కొత్తకాలనీ, కొత్తలంకలో మట్లపాలెం, కొమానపల్లి అంబేడ్కర్ నగర్, లంకాఫ్ ఠానేల్లంకతోపాటు పలు లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తాత్కాలిక సహాయం అందించారు తప్ప ఇప్పటి వరకు ముంపు నివారణకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇవన్నీ లోతట్టు ప్రాంతాలు కావడంతో కొద్దిపాటి వర్షాలకే ముంపుబారిన పడుతున్నాయి. మండలంలోని మురుగునీటి కాలువలు తూడు గుర్రపు డెక్కతో పూడికపోయి ముంపునీరు దిగేందుకు అవరోధంగా తయారవుతున్నాయి. వరదల సమయంలో మురుగునీటి కాలువలకు ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతులకు నోచుకోక వరద నీరు స్లూయిజ్‌ల ద్వారా కాలువల్లోకి చేరడంతో పొలాలు, లోతట్టు గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. వేసవి సీజన్‌లో కాలువల ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ఈ ఏడాది కూడా ముంపు తప్పేటట్టు లేదని లోతట్టు ప్రాంతవాసులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో డ్రెయిన్ల పరిస్థితి ఇదీ

ముమ్మిడివరం నియోజకవర్గంలో రెండు ప్రధాన డ్రెయిన్లు, ఏడు మధ్య తరహా డ్రెయిన్లు, 80 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ప్రధాన డ్రెయిన్లు, 35 కిలోమీటర్లు, మధ్యతరహా డ్రెయిన్లు 75 కిలోమీటర్లు, మైనర్ డ్రెయిన్లు 280 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. వర్షాలు, వరదల వచ్చే ముంపునీటిని గోదావరిలోకి మళ్లించేందుకు ఈ డ్రెయిన్లు ప్రధాన మార్గం. అయితే ఈ డ్రెయిన్లు దశాబ్దాల కాలంగా ఆధునీకరణకు నోచుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారై పూడుకుపోయాయి. ముంపునీరు దిగేందుకు అవరోధంగా తయారయ్యాయి. దీనికి తోడు తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి వర్షాలు, వరదల సమయంలో అవి పొంగి ప్రవహించి పంట పొలాలను, కాలనీలను ముంచెత్తుతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ముంపులో కొట్టుకుపోతున్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం వేసవిలోనే పూడికతీత, మరమ్మతులు చేపడితే ఎంతో మేలు జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డ్రెయిన్లు ఆధునీకరించాలి



పంట కాలువలు మూసివేసిన తరువాత అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం కాకుండా ప్రస్తుత వేసవిలోనే ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. వరి చేలు, లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడకుండా చర్యలు చేపట్టాలి.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

ప్రతిపాదనలు పంపించాం

ముమ్మిడివరం మండలంలో ప్రధాన మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లకు సంబంధించి గుర్రపు డెక్క తొలగించేందుకు సుమారు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– బోణం మాధవ్, డ్రెయిన్స్ ఏఈ, ముమ్మిడివరం

అభివృద్ధి పనులకు ఓఎన్‌జీసీ నిధులు కేటాయించాలి

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓఎన్‌జీసీ చమురు సంస్థ ద్వారా పి.మల్లవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అఖిలపక్ష నాయకులు ముక్తకంఠంతో కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు మాట్లాడుతూ ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు ప్రమేయంతో అంతా కలిసి పోరాడితే గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధుల సాధించుకోవచ్చని అన్నారు. కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్‌పీసీ కంపెనీ ప్రారంభంలో కలెక్టర్ సమక్షంలో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేసారు. వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, సర్పంచ్ పంపన రామకృష్ణ, స్థానిక నాయకులు మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులను జిల్లా అంతటికీ కేటాయించడం దారుణమన్నారు. ఒప్పందాలను అమలు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డి.వెంకటరమణ, వీఆర్ఎన్‌బీ ప్రసాద్, గుత్తుల వెంకట రమణ, దున్నా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాస్తారోకో



ముమ్మిడివరంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు

ముమ్మిడివరం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం ముమ్మిడివరంలో రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ 216 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో అధికార పార్టీలో ఉన్న మాల ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. చంద్రబాబు అంతం మాలల పంతం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు, రిపబ్లికన్ పార్టీ, రిటైర్డు ఎస్సీ ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాల మహానాడు ప్రతినిధుల గృహనిర్బంధం

అల్లవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేల ఇళ్లను బుధవారం ఉదయం ముట్టడించాలని జాతీయ మాల మహానాడు కన్వీనర్ పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా ఎమ్మెల్యే ఇళ్లను ముట్టడికి సిద్ధమవుతున్న అల్లవరం మాల మహానాడు కన్వీనర్ నాతి శ్రీనివాసరావుని గోడిలంకలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి అల్లవరం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యమాన్ని అణచివేసిన ప్రతి సారి ఉప్పెనలా ప్రజల్లో చైతన్యం వస్తుందని శ్రీనివాసరావు అన్నారు.

వేంకటేశ్వరుని ఆభరణాల అప్పగింతపై కొత్త కమిటీ

యానాం: యానాంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆభరణాల అప్పగింతకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం జాప్యం చేయడంపై బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అసెంబ్లీలో ప్రస్తావించారు. పాత కమిటీ నుంచి స్వామివారి ఆభరణాలను స్వాధీనం చేసుకునేలా కొద్దిరోజుల క్రితం డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులను నియమించారని అయితే వారంతా కేవలం రికార్డులు, రసీదులు పరిశీలన తప్ప కీలకమైన ఆభరణాలను ఇప్పటికీ స్వాధీనం చేసుకోలేదని అన్నారు. దీనిపై ఎందుకు తాత్సారం ప్రదర్శిస్తున్నారని ఆయన సీఎం రంగసామి దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే ఆభరణాల స్వాధీనంపై తాను మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశానని, ఆభరణాలను స్వాధీనం చేయకుంటే తాను తిరిగి కోర్టు ధిక్కారణ పిటిషన్ వేస్తానని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే అశోక్‌కు పలువురు ఎమ్మెల్యేలు మద్దతుగా మాట్లాడారు. సంబంధిత నియోజకవర్గ శాసనసభ్యుడి ఆధ్వర్యంలో నూతన కమిటీ నియమించాలని సూచించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేకి లేకుండా అధికారులతో కమిటీ వేయడాన్ని వారు ఆక్షేపించారు. దీనికి దేవదాయశాఖ సైతం నిర్వహిస్తున్న మంత్రి సీఎం రంగసామి స్పందించి యానాం ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యంలో ఆభరణాల స్వాధీనం తదితర అంశాలపై కమిటీ వేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

జాతీయ భద్రతను కాంక్షిస్తూ సైకిల్ యాత్ర



అమలాపురం పుర వీధుల్లో సైక్లోథాన్

అమలాపురం టౌన్: దేశ ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించేందుకు, మాదక ద్రవ్యాలు, ఆయుధాల పేలుడు తదితర సమస్యల పరిష్కారాన్ని కాంక్షిస్తూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సైక్లోథాన్ నిర్వహిస్తున్నట్లు దళ డిప్యూటీ కమాండర్ వీకే ప్రభాకర్ అన్నారు. ఈ యాత్ర బుధవారం సాయంత్రానికి అమలాపురం చేరింది. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమాండర్ ప్రభాకర్ మాట్లాడుతూ, సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా తొలిసారిగా గ్రేట్ ఇండియన్ కోస్టల్ సైక్లోథాన్‌ను చేపట్టినట్టు వివరించారు. 25 రోజుల పాటు 11 రాష్ట్రాల మీదుగా ప్రయాణం చేస్తున్నట్టు అసిస్టెంట్ కమాండర్ ఏకే సింగ్ చెప్పారు. మార్చి 7న పశ్చిమ బెంగాల్‌లోని బఖాలి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ముంబై, గోవా, మంగళూరు, కొచ్చి, హల్దియా, కోణార్క్, వైజాగ్, చెన్నై, పాండిచ్చేరి వంటి కీలక తీర నగరాల మీదుగా ప్రయాణించి, కన్యాకుమారిలో ఈ నెల 31న ముగుస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆర్మీ థీమ్, దేశభక్తి గీతా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైక్లిస్టులను, కమాండర్లను ఎస్పీ జ్ఞాపికలతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, అసిస్టెంట్ కమాండర్ ఎస్‌కే సప్తపది, సైక్లోథాన్ సభ్యులు శ్రీనివాస్, శ్రీకర్, లోహియా, మాజీ సైనికులు కటకం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో భట్నవిల్లి –పేరూరు మీదుగా బైపాస్ రోడ్డు జంక్షన్లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపట్టారు. కామనగరువు ఆమని ఆటోమొబైల్ వద్ద బైపాస్ రోడ్డు జంక్షన్‌ను డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్సై శేఖర్‌బాబు, పట్టణ ఎస్సై, హైవే అథారిటీ అధికారులు కలిసి బుధవారం పరిశీలించారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్లను వారు పరిశీలించారు. రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

వెంకన్న చెరువు ఆధునీకరణ పనుల పరిశీలన

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామ ప్రజలకు దాహాన్ని తీర్చే వెంకన్న చెరువు ఆధునీకరణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇటీవల చేపట్టారు. కొమరగిరిపట్నం ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ చింతా అనురాధ చొరవతో రూ.4.90 కోట్ల నిధులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల తర్వాత పనులు చేపట్టారు. మట్టి పనులను కూటమి నేతలు బుధవారం పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు,. నీటి పారుదల డీసీఎం చైర్మన్ దాట్ల గోపిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి పాల్గొన్నారు.

బాలికలకు స్వీయ రక్షణపై శిక్షణ



మలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్

అమలాపురం టౌన్: కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థినులు (బాలికలు) ఏదైనా అనుకోని ఆపద అనివార్యమైతే ఆత్మరక్షణ, ఆత్మ స్థైర్యంతో ఎదుర్కోవాలని పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు బాలికలు స్వీయ రక్షణ విషయంలో పలు పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్న క్రమంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం నిర్వహించిన ఆత్మరక్షణపై శిక్షణ కార్యక్రమంలో సీఐ వీరబాబు మాట్లాడారు. కరాటే మాస్టర్ పడాల అంజి ఆధ్వర్యంలో బాలికలకు కరాటే టెక్నిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్, మహిళా ఎస్సై పి.గంగాభవాని, ప్రధానోపాధ్యాయురాలు వి.విజయకుమారి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

తాళ్లరేవు: పదవ తరగతి పరీక్షలకు బుధవారం 17 మంది గైర్హాజరయ్యారు. మండల పరిధిలోని ఐదు కేంద్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 1,465 మంది విద్యార్థులకు 1,448 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల పరిధిలోని తాళ్లరేవు, ఇంజరం, పటవల, పి.మల్లవరం, బొడ్డుచిన వెంకటాయపాలెం కేంద్రాలతోపాటు యానాంలోని రీజెన్సీ హైస్కూల్లోని రెండు సెంటర్లలో రెండవరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు, తాళ్లరేవు హైస్కూల్లో నలుగురు బాలురు, ఏడుగురు బాలికలు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి మంగాయమ్మ తెలిపారు.

ఐ.పోలవరం మండల పరిధిలో..

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండల పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు మండల విద్యాశాఖాధికారులు ఎన్.కొండారెడ్డి, వి.సురేష్ బాబు బుధవారం తెలిపారు. ఐ.పోలవరం సెంటరు–ఎలో బాలురు 96 మంది, బాలికలు 104 మంది చొప్పున మొత్తం 200 మంది, ఐ.పోలవరం సెంటరు–బీలో బాలురు 74 మంది, బాలికలు 103 మంది, మొత్తం 177 మంది, మురమళ్ల సెంటరులో బాలురు 112, బాలికలు 127 మంది, మొత్తం 239 మంది, మురమళ్ల సాయి ఉన్నత పాఠశాలలో బాలురు 81 మంది, బాలికలు 95 మంది మొత్తం 176 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. మొత్తం నాలుగు సెంటర్లలో 363 మంది బాలురు, 429 మంది బాలికలు కలిపి మొత్తం 792 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. స్క్వాడ్ అధికారి హరి ప్రసాద్ నాలుగు సెంటర్లను పరిశీలించారు.

ఆక్వా జోనేషన్‌పై రీ సర్వే వేగవంతం

ఐ.పోలవరం: మండల పరిధిలో ఆక్వా జోనేషన్ రీ సర్వే వేగంగా కొనసాగుతోందని మండల తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తెలిపారు. మత్స్యశాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు 2018లో ప్రభుత్వం ఇచ్చిన జీవో–16 నిబంధనల మేరకు ఐ.పోలవరం మండలంలో మొత్తం 13 గ్రామాల్లో ఆక్వా జోనేషన్ రీ సర్వే చేసినట్టు ఆమె తెలిపారు. మండలస్థాయి ఆక్వా కమిటీ సమావేశంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018, 2023లో చెరువులకు సంబంధించిన రెవెన్యూ సర్వే నంబర్లను కలెక్టరు ఆక్వా జోన్ గెజిట్‌లను ప్రచురించారని ఆమె గుర్తు చేశారు. గతంలో ప్రచురించిన ఆక్వా జోన్ గెజిట్‌లో నమోదు కాని చెరువుల సర్వే నంబర్లు, వ్యవసాయానికి అనుకులంగా లేని ఆక్వా చెరువు తవ్వకాలకు అనుకూలంగా ఉన్న భూములను గ్రామస్థాయి కమిటీల ద్వారా రీ సర్వే చేశామన్నారు. మండల స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిపాదిత భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం ఈనెల 27, 28, 29 తేదీల్లో ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తరువాత ఆక్వా జోనేషన్ తుది నివేదికను రూపొందిస్తామని తహసీల్దార్ వివరించారు.

వేద ఘనాపాఠి డాక్టర్ శ్రీరామశర్మ



వేద ఘనాపాఠి శ్రీరామశర్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రభాకర ఫణి రాజా

అమలాపురం టౌన్: వేద ఘనాపాఠి, బహుభాషా కోవిదుడు, మహా మహోపాధ్యాయ డాక్టర్ చిర్రావూరి శ్రీరామశర్మ కారణ జన్ముడని పండితులు, వేద సభల నిర్వాహకులు అన్నారు. శ్రీరామశర్మ ఈనెల 4న శృంగేరిలో శివైక్యం చెందిన సందర్భంగా స్థానిక ఏఎస్ఎన్ మహిళా కళాశాల ప్రాంగణంలో శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ, ఆపస్తంభ పురోహిత పరిషత్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన శ్రీరామశర్మ సంస్మరణ సభలో వక్తలు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. వేద ఘనా పాఠి ఈవని రామచంద్ర సోమయాజి అధ్యక్షతన ఈ సంస్మరణ సభ జరిగింది. శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ, ఆపస్తంభ పురోహిత పరిషత్ ప్రతినిధులు గుళ్లపల్లి ప్రభాకర ఫణి రాజా, గొర్తి సాయమి, గుళ్లపల్లి వెంకట్రామ్, యేడది నళినీ కుమార్ పాల్గొన్నారు. సంస్మరణ సభలో తొలుత శ్రీరామశర్మ చిత్ర పటానికి పండితులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

తాళ్లరేవు: మండల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు గురువారం నుంచి మూడు రోజుల పాటు పోషణ్ భీ, పడాయి భీపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వంజరాన మాధవి తెలిపారు. మండల పరిధిలోని చొల్లంగి జిల్లా పరిషత్ హైస్కూల్, నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

మహిళలను గౌరవించాలి

యానాం: మహిళలను గౌరవించడం భారతీయ సమాజ సంప్రదాయమని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా, శిశుసంక్షేమ శాఖ, మహిళా సాధికారిత విభాగం సంయుక్తంగా మహిళలపై హింస నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసాప్రవృత్తులు, చట్టాలను అవగాహన చేసుకోవడం తదితర అంశాలపై మాట్లాడారు. డాక్టర్ మెల్లం ప్రమీలా మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలంటే ఆమె ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని అన్నారు. మహిళా సాధికారిత విభాగం సమన్వయకర్త డాక్టర్ కె శ్రీలత, ఎస్సై సీతారత్న, మిషన్‌శక్తి జిల్లా కోఆర్డినేటర్ రోజలిన్, మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్, అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల యూనిట్ల పరిశీలన



బండారులంకలో మహిళా సంఘాల సభ్యుల యూనిట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: కాకినాడలో ప్రోగ్రాం డైరెక్టర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పరిశీలన,శిక్షణ కోసం రూరల్ మండలం బండారులంకలో బుధవారం పర్యటించారు. మట్టపర్తి వారిపాలెంలో రెండు స్వయం సహాయక సంఘం గ్రూపు సభ్యులు బ్యాంకు నుంచి రుణం, శ్రీనిధి, సీఐఎఫ్‌లో రుణం పొంది చేపట్టిన ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించారు. మహిళా సంఘాలు నిర్వహిస్తున్న పీచు తాడు ఫ్యాక్టరీ, పోక చెక్కల వక్కపొడి తయారీ విధానాలను ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంపీడీవో బాబ్జి రాజు, డీఆర్‌డీఏ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశీలించి డ్వాక్రా మహిళల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేంద్ర, సీసీలు రమేష్, దుర్గ కుమారి, స్వయం సహాయ సంఘ మహిళలు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు... పొగతో ఉక్కిరి బిక్కిరి

అమలాపురం టౌన్: స్థానిక 23వ వార్డు పరిధిలోని కె.అగ్రహారం కృష్ణారావు వీధిలో ఓ ప్రైవేటు ఖాళీ స్థలంలో పేరుకుపోయిన ఆ స్థల నిర్వాహకులు నిప్పు పెట్టడంతో కమ్మిన దట్టమైన పొగతో ఆ వార్డు ప్రజలు బుధవారం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ పొగ వల్ల స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు ఎదుర్కొన్నారు. దీంతో తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులను ఎదురుగా ఉన్న పెంకుటిల్లు అరుగుపైకి తరలించారు. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఖాళీ స్థలంలో చెత్తకు నిప్పు పెట్టి ప్రజలకు ఆటంకం కల్పించిన స్థల నిర్వాహకులకు మున్సిపాలిటీ రూ.5 వేల జరిమానా విధించింది. మున్సిపల్ సిబ్బంది నీళ్ల ట్యాంకర్‌తో వచ్చి పొగ రాకుండా నిప్పును ఆర్పివేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఈ ఘటనపై అసహనం వ్యక్తం చేశారు. 23వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి కావడంతో పొగ సెగపై మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి చర్యలు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

అమలాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి కే ధర్మప్రసాద్ అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఏవో మాట్లాడుతూ విచక్షణారహితంగా రైతాంగం పురుగు మందులు, ఎరువులు వాడడం వల్ల భూసారం క్షీణిస్తుందన్నారు. ఈ సదస్సులో ఏపీఎం సురేంద్ర, ఏపీ సీఎన్ఎఫ్ ఏవో శ్రీనివాస్, ట్రైనర్ ఎం.సూరిబాబు, ఏఈఓ ప్రేమ్ కుమార్, మండల ఎన్ఎఫ్ ఇన్‌చార్జ్ అప్పారి చిన వెంకటరమణ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.